RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 299 | 20 ఆదివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 వెల : రూ.1/-

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారనే విషప్రచారాన్ని ఆపండి: రోజా



**తిరుమల, సెప్టెంబర్ 19 రాజధాని వాయిస్ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీపై సాగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్వామివారి ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవని... కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కోట్లమంది భక్తుల నమ్మకాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడాన్ని కూటమి నేతలు తక్షణమే కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ నిజమేంటో స్పష్టంగా బయటపడిందని పేర్కొన్న రోజా... జగన్ హయాంలో కల్తీ జరిగిందంటూ వైసీపీపై చేస్తున్న విషప్రచారానికి స్వస్తి పలకాలన్నారు. జగన్ పాలన పచ్చిపాలు లాంటిదని, అక్కడ కల్తీకి ఎంతమాత్రం ఆస్కారం లేదని అన్నారు. నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న నెయ్యి ట్యాంకర్లను టీటీడీ బోర్డు తనిఖీల్లోనే తిరస్కరించి వెనక్కి పంపినప్పుడు, ఆ నెయ్యి ప్రసాదాల్లో కలవలేదని స్పష్టమవుతున్నా, జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని రోజా తన పోస్ట్‌లో నిలదీశారు.

## విద్యుత్ సరఫరాపై కేటీఆర్ సమీక్ష

**పెబ్బేరు, సెప్టెంబర్ 19** వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరు, నమోదైన వివరాలను పరిశీలించారు. అధికారులతో సమావేశమై విద్యుత్ సరఫరా పరిస్థితులపై సమాచారం సేకరించారు. ప్రాంతంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. సబ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న లాగ్‌బుక్‌ను పరిశీలించిన నేతలు విద్యుత్ సరఫరా గంటలు, అంతరాయాలు, వినియోగానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ఫీడర్ల ద్వారా అందిస్తున్న విద్యుత్ సరఫరాపై అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ అంతరాయాల కారణాలు, సరఫరా నిర్వహణపై వివరణ కోరారు. ప్రజలకు అందుతున్న సేవలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని తమ సమస్యలను నేతల దృష్టికి తీసుకువచ్చారు. తరచూ జరుగుతున్న విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం విద్యుత్‌పై ఆధారపడే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాల వల్ల పంటల నిర్వహణ కష్టంగా మారుతోందని తెలిపారు. రైతుల సమస్యలను విన్న కేటీఆర్, ఇతర నేతలు విద్యుత్ సరఫరా వ్యవస్థపై అధికారులతో చర్చించారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ అత్యంత కీలకమని, సరఫరాలో అంతరాయాలు తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## వర్షాభావంపై సీఎం సమీక్ష

- అక్టోబర్ 1న కరువు మండలాల ప్రకటన – 513 మండలాల్లో కరువు ప్రాథమిక అంచనా – రైతులకు తక్షణ సహాయ చర్యలపై దృష్టి
- తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు



**అమరావతి, సెప్టెంబర్ 19 రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తాగునీటి సరఫరా అంశాలపై క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 513 - మిగతా 2లో..

## జనసేన శ్రేణులకు నాదెండ్ల పిలుపు

- స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి – కూటమి స్ఫూర్తితో ముందుకు సాగాలి
- క్రమశిక్షణే పార్టీ బలమని వ్యాఖ్య – విశాఖ ఎన్నికలు కీలకమని స్పష్టం



**విశాఖపట్నం, రాజధాని వాయిస్ :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీకి అత్యంత కీలకమైనవని, పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించడం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలను ప్రతి కార్యకర్త గౌరవించాలని నాదెండ్ల మనోహర్ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అపోహలు, అనవసర ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. పార్టీ నిర్ణయాలు, - మిగతా 2లో..

# సాగర స్వచ్ఛతకు భారీ ప్రాధాన్యం: సీఎం

- ఆర్‌కే బీచ్‌లో కార్యక్రమం నిర్వహణ
- సముద్ర వ్యర్థాల నిర్వహణపై దృష్టి
- చంద్రబాబు పర్యవేక్షణలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



**విశాఖపట్నం రాజధాని వాయిస్ :** స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్ర తీర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర స్వచ్ఛత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సమీక్షిస్తూ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. సముద్ర తీర ప్రాంతాల పరిశుభ్రతను ప్రజల భాగస్వామ్యంతో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పెదజాలరిపేటలో ఏర్పాటు చేసిన ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. సముద్రంలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పునర్వినియోగం చేయడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు. సముద్ర కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు.సముద్రంలో వ్యర్థాల సేకరణలో పాల్గొంటున్న పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. వారి అనుభవాలు, ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని అభినందనలు తెలిపారు. సముద్ర ఉపరితలంలో సేకరించిన వ్యర్థాలను డిజిటల్ తూకం ద్వారా కొలిచే విధానాన్ని పరిశీలించారు. వ్యర్థాల పరిమాణాన్ని ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా సముద్ర కాలుష్య నియంత్రణకు అవసరమైన సమాచారం అందుతుందని అధికారులు వివరించారు. నగర పారిశుద్ధ్య నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగంపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారు. జీవీఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చిన సీవరేజ్ రోబో పనితీరును ప్రదర్శనశాలలో పరిశీలించారు.

# ఉపాధి మేళాలో 51 వేల నియామక పత్రాలు

- యువతకు కేంద్రం నుంచి భారీ అవకాశాలు
- ఉపాధి కల్పనపై ప్రధాని మోదీ దృష్టి
- స్టార్టప్ రంగంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు
- యువశక్తిపై ప్రపంచానికి విశ్వాసం




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19రాజధాని వాయిస్ :** కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించడం, ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను వేగవంతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ భారత యువత ప్రతిభ, నైపుణ్యాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని సంపాదించాయని అన్నారు. భారత యువ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, నైపుణ్యం కలిగిన యువశక్తిపై ప్రపంచ దేశాలు ఆశలు పెట్టుకున్నాయని పేర్కొన్నారు. విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన, వ్యాపార రంగాల్లో భారత యువత విశేష కృషి చేస్తోందని తెలిపారు.స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు యువతకు కొత్త అవకాశాల ద్వారాలను తెరుస్తున్నాయని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందాల ద్వారా కొత్త మార్కెట్లు, వ్యాపార భాగస్వామ్యాలు ఏర్పడుతున్నాయని చెప్పారు.

# పేదల సొంతింటి కల సాకారం

- దశాబ్దాల నిరీక్షణకు ముగింపు
- నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- వేలాది కుటుంబాలకు సర్వహక్కుల భరోసా



**విశాఖపట్నం, రాజధాని వాయిస్ :** విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల నాటి సొంతింటి హక్కుల కల నెరవేరింది. 'పేదలకు పట్టాభిషేకం' పేరుతో నిర్వహించిన కార్యక్రమం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం నిర్వహించిన సభలో లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేసి, వారి జీవితాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయంతో పేద కుటుంబాలకు శాశ్వత భద్రత లభించిందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న హక్కులు తమ చేతికి అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సభా ప్రాంగణం అంతా ఉత్సాహభరిత వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం ఎన్టీఆర్ ప్రారంభించిన పేదల గృహ హక్కుల ఆలోచనను మరింత విస్తరించి అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా ఇళ్లలో నివసిస్తున్నప్పటికీ పూర్తి హక్కులు లేక ఇబ్బందులు - మిగతా 2లో..

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు: మోదీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19రాజధాని వాయిస్ :** భారత్ పలు దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. దేశీయ నైపుణ్యా లపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందన్నారు. వర్చువల్‌గా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యనించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు 51 వేల కంటే ఎక్కువ నియామక పత్రాలను జారీ చేశారు. 'భారత్ ఇప్పటివరకూ 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. వ్యాపారులు, రైతులు, మహిళలు.. ఇలా ప్రతి ఒక్కరికీ కొత్త అవకాశాలు లభిస్తాయి. ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. గుర్తింపు పొందిన స్టార్టప్‌లు దాదాపు సగం వరకు టైర్-2 టైర్-3 నగరాల నుంచే పుట్టుకొస్తున్నాయి. దేశీయ లక్ష్యాల సాధనకు యువతే కీల కం' అని మోదీ అన్నారుయువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.

## పార్టీ శ్రేణులకు బొత్స దిశానిర్దేశం



**రాజాం, రాజధాని వాయిస్** రాజాం నియోజకవర్గ సమ న్వయకర్త తలె రాజేష్ ఆధ్వర్యంలో రాజాం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బెల్లాన చంద్రశేఖర్, యువ నాయకురాలు డాక్టర్ బొత్స అనూష, యువ నాయకుడు డాక్టర్ బొత్స సందీప్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. - మిగతా 2లో..

# వర్షాభావంపై సీఎం సమీక్ష



మండలాలు వర్షాభావ ప్రభావానికి గురైనట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు సంబంధిత నివేదికలు సిద్ధం చేసి, సెప్టెంబర్ 29న రాష్ట్ర స్థాయి కమిటీ తుది నివేదిక సమర్పించనుందని వివరించారు.వ్యవసాయ, ఉద్యాన పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యాన పంటల సంరక్షణ కోసం ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించినట్లు పేర్కొంటూ, ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, మద్దతు చర్యలు వేగంగా అందించాలని సూచించారు. కరువు పరిస్థితుల కారణంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేశారు. బోర్లపై ఆధారపడే ప్రాంతాల్లో అవసరమైతే అదనపు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు.విశాఖపట్నంలో భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి అవసరమైన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నగర తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించడం, రైతులకు మద్దతు అందించడం, తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# జనసేన శ్రేణులకు నాదెండ్ల పిలుపు




అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సిద్ధాంతాలతో పాటు అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై అవగాహన, వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే నాయకులనే అభ్యర్థులుగా ఎంపిక చేసే అవకాశం ఉంటుందని వివరించారు. అభ్యర్థుల ఎంపికలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఒకరికి అవకాశం వచ్చినప్పుడు దానిని మొత్తం పార్టీకి వచ్చిన అవకాశంగా భావించి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. టికెట్ లభించగానే విజయం ఖాయమని భావించకుండా ప్రజల మధ్య ఉండి మద్దతు సంపాదించాలని అన్నారు.ఈ సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారం అంశాన్ని కూడా ప్రస్తావించిన నాదెండ్ల మనోహర్, ఆ అంశంపై పవన్ కళ్యాణ్ తీసుకున్న చర్యలను వివరించారు. ఉక్కు కర్మాగారం అంశంపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు పవన్ కళ్యాణ్ కృషి చేశారని పేర్కొన్నారు. దీనికి సంబంధించి వివిధ రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాలుగు నియోజకవర్గాల జనసేన శ్రేణులు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రజల మద్దతు పొందాలని నాయకత్వం సూచించింది. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# పిఠాపురం అభివృద్ధికి పవన్ కళ్యాణ్ శ్రీకారం

**పిఠాపురం, రాజధాని వాయిస్** : పిఠాపురం నియోజక వర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రోజుల పర్యటనకు సిద్ధమవు తున్నారు. ఈ పర్యటనలో దాదాపు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నా యి. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతులు, రవాణా సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు కీలక కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.పర్యటన తొలి రోజున ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని 52 ఆవాసాలకు చెందిన సుమారు 97 వేల మందికి తాగునీటి సరఫరాను మెరుగుపరిచే నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రజలకు అంకితం చేయనున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం కాలక్రమేణా సామర్థ్యం కోల్పోవడంతో ఆధునీకరణ పనులు చేపట్టారు. రూ.9.59 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమం పూర్తికావడంతో చివరి గ్రామాల వరకు తాగునీరు అందే పరిస్థితులు ఏర్పడనున్నాయి. దీంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరత సమస్యకు గణనీయమైన ఉపశమనం లభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.పిఠాపురం పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాటు చేసిన "పీఠికాపుర వనం"ను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విశ్రాంతి వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. అలాగే చందుర్తి--తాటిపర్తి బీటీ రహదారి, ఎఫ్.కె. పాలెం మైసమ్మ చెరువు సుందరీకరణ పనులను కూడా ప్రారంభించనున్నారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు రవాణా, వినోదం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి. రెండో రోజు నిర్వహించే బహిరంగ సభలో భారీ స్థాయిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. రూ.307 కోట్ల వ్యయంతో బహుళ గ్రామాల తాగునీటి పథకం, రూ.200 కోట్లతో పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ.80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, అమృత్ పథకం కింద మున్సిపాలిటీ తాగునీటి పనులు, రూ.100 కోట్లతో రహదారి నిర్మాణాలు చేపట్టనున్నారు. అదనంగా పిఠాపురం ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పట్టణాభివృద్ధికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు.ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సంక్షేమానికి కూడా ఈ పర్యటనలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత కోసం ఆధునిక లైఫ్ జాకెట్లు, చేపల నిల్వ కోసం ఐస్ బాక్సులతో కూడిన వాహనాలు, డ్రై ఫిష్ యూనిట్లను పంపిణీ చేయనున్నారు.

# మంగళగిరిలో అట్టహాసంగా ఏపీఎల్ ప్రారంభం



అమరావతి: మంగళగిరి స్టేడియంలో ఉమెన్ ఏపీఎల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నారా బ్రాహ్మణి భారత జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో మంది మహిళలకు ఇది మంచి ప్లాట్‌ఫామ్ అని పేర్కొన్నారు. నెక్ట్స్ జనరేషన్ మహిళలకు ఈ టోర్నమెంట్ స్ఫూర్తిగా నిలుస్తుందన్నా రు. టాలెంట్ ఉండి అవకాశం దొరికితే.. నమ్మకంగా సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు.ఈ సందర్భంగా ఉమెన్ ఏపీఎల్ ట్రోఫీని నారా బ్రాహ్మణి ఆవిష్కరించారు. విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్, గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు, సినీ నటి స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు. హేమచంద్ర, గీతామాధురి పాటలతో అలరించారు. ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ -1 మ్యాచ్‌లో భాగంగా అమరావతి ఈ ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు తలపడుతున్నాయి.

# పార్టీ శ్రేణులకు బొత్స దిశానిర్దేశం



రానున్న రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు.సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాజాం నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాలు, విలువల కోసం పనిచేసే వ్యక్తులని అన్నారు. రాజకీయాల్లో వ్యక్తులు వస్తుంటారని, పోతుంటారని, కానీ పార్టీ కోసం అంకితభావంతో కష్టపడే కార్యకర్తలే నిజమైన బలమని పేర్కొన్నారు. కార్యకర్తల కష్టంతోనే పార్టీలు బలపడతాయని, ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదిస్తాయని వివరించారు. పార్టీ నిర్మాణంలో ప్రతి కార్యకర్త పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.కార్యకర్తలకు గుర్తింపు కల్పించే ఉద్దేశంతో గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బొత్స సత్యనారాయణ తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీకి చెందినవాడిగా గర్వంగా చెప్పుకునేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం పార్టీ తరఫున పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు కష్టపడి పనిచేసిన వారికి తగిన బాధ్యతలు, అవకాశాలు లభిస్తాయని చెప్పారు. గ్రామాల్లో ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం, పార్టీ విధానాలను వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రశ్నించే హక్కు అత్యంత ముఖ్యమని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం




ఎదుర్కొన్న కుటుంబాలకు ఇప్పుడు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించామని వివరించారు. ఇకపై ఆ ఇళ్లపై ఎలాంటి వివాదాలు, అనుమానాలు, ఆందోళనలు ఉండవని, సర్వహక్కులు లబ్ధిదారులవేనని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయం పేదల ఆత్మగౌరవాన్ని పెంచడమే కాకుండా వారి కుటుంబ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 ప్రాంతాల్లో ఉన్న భూములను క్రమబద్ధీకరించి ప్రజలకు అందజేశామని ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమికి సంబంధించి సుమారు రూ.8,874 కోట్ల విలువైన ఆస్తులపై ప్రజలకు హక్కులు కల్పించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు రుణాల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలు ఇకపై తమ ఆస్తులను ఆధారంగా చేసుకుని బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. దీంతో చిన్న వ్యాపారాలు, విద్య, ఉపాధి అవసరాలకు ఆర్థిక సహాయం పొందడం సులభమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పట్టాలు పొందిన కుటుంబాలతో పాటు మిగిలిన అర్హులందరికీ కూడా త్వరలో హక్కు పత్రాలు అందజేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న మరో 35 కాలనీలలోని సుమారు 10 వేల కుటుంబాలకు, వివాదాస్పద ప్రాంతాల్లోని 12,149 మంది నివాసితులకు కూడా శాశ్వత హక్కులు కల్పించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేవాలయ భూములు మరియు ఇతర వివాదాల పరిష్కారం కోసం న్యాయపరమైన చర్యలు వేగవంతం చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ హక్కు పత్రాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక, పరిపాలనా సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రజలకు భరోసా కల్పించడం, హక్కులను అందించడం, సంక్షేమాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతగా కొనసాగుతుందని చెప్పారు. విధ్వంసం నుంచి వికాసం వైపు, అనిశ్చితి నుంచి నమ్మకం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నాన్ని అంతర్జాతీయ ప్రమాణాల నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పరిశ్రమల విస్తరణ, తాగునీటి ప్రాజెక్టులు విశాఖ భవిష్యత్తును మార్చనున్నాయని చెప్పారు. ప్రజల సహకారంతో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని సాధించి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెడతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 19,రాజధాని వాయిస్:** పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి "ప్రజా దర్బార్" నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, విద్యుత్, రహదారులు, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా...వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రతి సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు క్షేత్రస్థాయిలో పారదర్శకమైన జవాబుదారి పాలనను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రత్యేకంగా ప్రజా దర్బార్ రోజున మాత్రమే కాకుండా ప్రతి రోజు మా కార్యాలయంలో తాను ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, నిత్యం వందలాది మంది ప్రజలు తమ సమస్యలను తీసుకుని కార్యాలయానికి వస్తుంటారని అన్నారు.సమస్యలను ఓపికగా విని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతోనే ప్రతి ప్రజాదర్బార్ నందు పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యాలయానికి వచ్చి వినతులు అందజేస్తున్నారని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,టీడీపీ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు ఈవి సుధాకర్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!

దిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. దిల్లీ శివారులోని ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

# కార్యకర్తలకే అభివృద్ధి పనులు.. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి కీలక నిర్ణయం



**ఎన్టీఆర్ జిల్లా,రాజధాని వాయిస్:** తిరువూరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించేలా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు పెద్ద కాంట్రాక్టర్లకే పరిమితమైన అభివృద్ధి పనుల్లో స్థానికంగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు అవకాశం కల్పించే విధానానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లకు కాకుండా కార్యకర్తలకు అప్పగించాలని నిర్ణయించారు. 'కార్యకర్తే కాంట్రాక్టర్' అంటూ పార్టీ కేడర్‌కు కొలికపూడి శ్రీనివాసరావు ఈ అవకాశం కల్పించారు. అధికారుల సమక్షంలో దాదాపు రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్ కాపీలను కార్యకర్తలకు ఎమ్మెల్యే అందజేశారు.తిరువూరు నియోజకవర్గంలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, కష్టకాలంలో అండగా నిలిచిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఉచితంగా బజాజ్ ప్లాటినా బైక్‌లను కూడా ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక అభివృద్ధి పనుల్లో కార్యకర్తలను భాగస్వామ్యం చేస్తూ ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీకి కార్యకర్తలే అసలైన వెన్నెముక అని కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# 274 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 19రాజధాని వాయిస్:** పట్టణంలోని అనీబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ లో విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి 274 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 17 మందికి కళ్ళ అద్దాలు అవసరమని నిర్ధారించి ప్రభుత్వం ద్వారా కళ్లద్దాలు ఇప్పిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కల్లూరు, రాజుపాలెం, కామనూరు ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ పాఠశాలలో మరియు ఎలిమెంటరీ స్కూల్స్ అందరి పిల్లలకు పరీక్షలు చేశామని తెలిపారు. శనివారం నుండి ప్రొద్దుటూరు టౌన్ లోని వైఎంఆర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని ఏబీఎం స్కూల్లో ప్రారంభించడం జరిగినదని తెలిపారు. పిల్లలకి సూచనలు ఇస్తూ మొబైల్ ఫోన్ స్క్రీన్ ని ఎక్కువ టైం చూసినట్లయితే కంటి చూపు కోల్పోవడమే కాకుండా మానసిక రుగ్మతలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుపుతూ మంచి పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం తప్పనిసరి చేసుకుని మొబైల్ స్క్రీన్ కి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎంఆర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే.మానస, అర్బన్ హెల్త్ సెంటర్ సిఓ సుబ్బారెడ్డి, ఏబీఎన్ స్కూల్ హెడ్మాస్టర్ గీత మరియు ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పుష్ప, మల్లేశ్వరి, నూర్జహాన్ పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి భారీ వర్ష సూచన

**అమరావతి, రాజధాని వాయిస్:** ఉత్తర అండమాన్.. దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఈ అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అంచనా వేశారు. బుధవారం ఉదయానికి పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా--ఉత్తరాంధ్ర తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య.. దానికి ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తీర ప్రాంతాల్లో గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు. సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని.. కొత్తగా ఎవరూ సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: కలెక్టర్ సాయికాంత్



**గుంటూరు,రాజధాని వాయిస్ :** ఎస్.సి, ఎస్.టి సంక్షేమానికి కృషి చేస్తున్న ట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ లేని యానాది కులానికి చెందిన 531 మందిని గుర్తించామని, డొమిసిల్ సర్టిఫికెట్ తహసిల్దార్ నుండి ఇప్పించి ఆధార్ కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. గిరిజన భవన్ మరమ్మతుల పనులుమంజూరు చేశామని అన్నారు. అంబేద్కర్ భవన్ పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందించుటకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. జిల్లాలో మార్పు కార్యక్రమం ప్రత్యేకంగా తీసుకున్నామని, ఈ కార్యక్రమంలో వసతి గృహాలు, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి వసతి గృహాలలో అన్ని వసతులు కల్పించాలని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులపై జరిగే దాడులపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మొత్తం కేసులు, డ్రాప్ చేసిన కేసులు వివరాలు కూడా సమావేశంలో అందించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ దుకాణాలు నిబంధనల మేరకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.వసతి గృహాలలో మెనూ పక్కాగా, నాణ్యమైన ఆహార పదార్థాలు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలపై వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్.సి, ఎస్.టి మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని, ఆ మేరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిర్దేశిత సమయంలో న్యాయం లబ్ధిదారులకు అందించేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో సునిశితమైన కేసుల వివరాలు పోస్టు చేయరాదని స్పష్టం చేశారు.ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్ లో కేసులు ఉండకుండా, కేసులు సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పింఛను మంజూరు చేయుటకు విద్యుత్ కనెక్షన్ నంబర్ విధిగా ఉండాలని ఎస్.జి.ఎస్.డబ్ల్యు సిబ్బంది అంటున్నారని దానిపై దృష్టి సారించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టి చట్టాలపై మరింత అవగాహనను పోలీసు శాఖకు అందించడం అవసరమని అభిప్రాయపడ్డారు.కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ జూలై నుండి ప్రత్తిపాడులో కేసు పెడుతుంటే తీసుకోవడం లేదన్నారు. అనునిత్యం అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టిలకు మంజూరు చేసిన దుకాణాలు, వారే అనుభవించేటట్లు చూడాలని, లబ్ధిదారులు ఇతరులకు ఇచ్చినా చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహాలలో ఆహార పదార్థాలు నాణ్యత మెరుగు పరుచుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా సాంఘిక సంక్షేమ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, డి.ఎస్.పిలు, కమిటీ సభ్యులు అనురాధ, గుడెపు అశ్వినీ కుమార్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కొత్తగా ఓటరు నమోదు తప్పనిసరి



**గుంటూరు, రాజధాని వాయిస్ :**ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికలలో ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తెలిపారు. గతంలో తయారు చేసిన ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిందేనని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ కృష్ణ – గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ప్రస్తుత హోదా 2027 మార్చి 29వ తేదీన ముగుస్తుందన్నారు. కృష్ణ – గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల నోటిఫికేషన్ ఈ నెల 28వ తేదీన ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమానికి బహిరంగ నోటీస్ విడుదల చేయడం జరుగుతుందన్నారు.అక్టోబర్ 15, 25 తేదీలలో వార్తా పత్రికలు ద్వారా ప్రచురణ రెండు సార్లు జరుగుతుందన్నారు. నవంబరు 6వ తేది వరకు ఓటరు నమోదుకు ఫారం 19 స్వీకరణ జరుగుతుందన్నారు.నవంబరు 25వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల, డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 25వ తేదీ నాటికి అభ్యంతరాల పరిష్కారం జరుగుతుందని వివరించారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా విడుదల జరుగుతుందని చెప్పారు.ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్) కింద 1,68,220 నోటీసులు జారీ చేయగా, 1,094 మాత్రమే విచారణ పెండింగ్ లో ఉందన్నారు. ఫారం 6 – 12,044, ఫారం 7 – 2,047, ఫారం 8 – 9,085 దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటి వరకూ ఫారం 6 క్రింద అందిన వాటిలో 8,407 దరఖాస్తులు ఓటరుగా నమోదు చేయడం జరిగిందని, 370 తిరస్కరించడం జరిగిందని వివరిం చారు. ఫారం 7 క్రింద అందిన దరఖాస్తులలో 1,899 ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని, మూడు తిరస్కరించడం జరిగిందని చెప్పారు.ఫారం 8 క్రింద అందిన దరఖాస్తులలో 6,859 ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని, 608 తిరస్కరించడం జరిగిందని చెప్పారు. బుక్ ఎ కాల్ క్రింద రాష్ట్రంలో అత్యధికంగా వచ్చిన కాల్స్ లో గుంటూరు జిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు.ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ఇ.ఆర్.ఓ లు ఐ.కిషోర్, పద్మావతి, గంగ రాజు, ముఖ్య టౌన్ ప్లానింగ్ అధికారి రాంబాబు, కాంగ్రెసు పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఎన్.ఓంకార్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వై వి సుబ్బారావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ఆర్.వి.నరసింహా రావు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌సీఐ రిటైర్డ్ ఉద్యోగులకు సేవా గుణం మెండు: ఎమ్మెల్సీ లేళ్ల



**గుంటూరు, రాజధాని వాయిస్:** పదవీ విరమణతోనే జీవితానికి ఫుల్‌స్టాప్ పడినట్లు కాదనీ... అక్కడి నుంచి సామాజిక స్పృహతో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించడమే ఎవరి జీవితా నికైనా అర్థం – పరమార్థాన్ని ఆపాదించి పెడుతుందనీ... శాసన మండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. అందుకు విశాల దృక్పథం గల భారత ఆహార సంస్థ విశ్రాంత ఉద్యోగులే ప్రత్యక్ష నిదర్శనమని ఆయన కొనియాడారు. సేవా గుణ సంపన్నతతో పాటు వారిలో మానవత్వం మెండని ఆయన తెలిపారు.శనివారం అమరావతి రోడ్డులోని ఒక ఫంక్షన్ హాలులో ఎఫ్‌సిఐ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమకు మొదటి నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ అండదండగా నిలిచిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ఎఫ్‌సిఐ విశ్రాంత ఉద్యోగులకు విశేష అనుభవంతో సామాజిక స్పృహ, సానుకూల దృక్పథం, సేవా తత్పరత అధికమని కొనియాడారు. నిస్వార్థంతో కూడిన నిబద్ధతతో ముందుకు సాగే బందా రవీంద్రనాథ్ వ్యక్తిత్వమే అందుకు నిదర్శనమని కితాబిచ్చారు. పదవీ విరమణ తర్వాత కృష్ణా.. రామా.. అంటూ ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా తాను స్థాపించిన స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారని వివరించారు.ఈ విషయంలో ఆయనతో పాటు అనేక మంది విశ్రాంత ఉద్యోగులు కూడా మేము సైతం అంటూ తమ స్ఫూర్తి ఉద్యమంలో భాగస్వాములైనట్లు ఆయన వెల్లడించారు. వారి సహాయ సహకారాలు మరువలేనివని పేర్కొంటూ.. వారే తన కుటుంబ సభ్యులని.. వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికై తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. వారంతా ఇదే విధంగా ముందుకు సాగుతూ స్ఫూర్తి ఫౌండేషన్ కార్యక్రమాల్లో మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.రాష్ట్ర అధ్యక్షుడు బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, భారత ఆహార సంస్థ ఉద్యోగులుగా తాము విశ్రాంతి తీసుకున్నామే తప్ప జీవితానికి కాదని చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మానస పుత్రిక అయిన స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు.ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి ఎఫ్‌సిఐ విశ్రాంత ఉద్యోగులతో అవినాభావ సంబంధం ఉన్నట్లు ఆయన తెలిపారు. తమకు అవసరమైన అన్ని సమయాలలో ఆయన అండగా నిలిచినట్లు ఆయన వెల్లడించారు. నూనె ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఎఫ్‌సిఐ విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలలో మరింత చురుకైన పాత్ర పోషించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు నల్లయ్య, నాగమల్లేశ్వరి, రమణారెడ్డి, గోపిరెడ్డి, హరిప్రసాద్, రమణయ్య, ఖాన్, ఎలమంద, రవిచంద్ర ప్రసాద్ భూషణం,మూర్తి పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, రాజధాని వాయిస్ :**ప్రజలకు అన్ని వ్యవస్థలు జవాబుదారీగా ఉండాలని, ఇళ్ల స్థలాలపై ప్రత్యేక దృష్టిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా స్వీకరించారు. ఇళ్ల స్థలాల కేటాయింపు, మురుగు నీటి సమస్య, విద్యుత్ స్థంభాల ఏర్పాటు వంటి వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలపై వెంటనే ఎమ్మెల్యే నసీర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆయా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు.త్వరలో నూతన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం అందించబోతోందని చెప్పారు. ఇప్పటికే స్పౌజ్ కేటగిరీ కింద భార్యాభర్తల్లో ఒకరు మరణిస్తే వెంటనే భాగస్వామికి అందించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెల వ్యవస్థను తీసుకొచ్చిందని, మండల, జిల్లా స్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలకు సంతృప్తికర స్థాయిలో అధికారులు సేవలందించాలని సూచించారు.

# బడుగు, బలహీన వర్గాల ఆరోగ్యానికి సీపీఐ పెద్దపీట: ముప్పాళ్ల!




**గుంటూరు, రాజధాని వాయిస్ :** బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆరోగ్యానికి సిపిఐ పెద్దపీట వేస్తుందని జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ సమితి పేరుతో గతంలో జిల్లా స్థాయిలో సుమారు నాలుగు వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు.సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలలో భాగంగా శనివారం స్థానిక అశోక్ నగర్ లో ఉన్న ఎర్రజెండా సెంటర్ నందు సురక్ష హాస్పిటల్స్ సౌజన్యంతో..శంకర కంటి హాస్పటల్, జిల్లా అందత్వ నివారణ సంస్థల సహకారంతో సిపిఐ నగర సమితి కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా చిన్నపిల్లలు, మహిళా సంబంధిత సమస్యలకు, ఎముకలు, కీళ్లు, నరాలు, జాయింట్ రీప్లేస్మెంట్, క్రిటికల్ కేర్, మానసిక ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్ తదితర వైద్య సేవలు ఈ శిబిరం నందు నిర్వహించారు. శంకర్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి కంటి శుక్లాల ఆపరేషన్లు, అతి తక్కువ ధరలకే కళ్ళజోళ్ళు, అలాగే బిపి, షుగర్ పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా అందజేశారు.ఈ క్యాంపుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలని కోరిన పార్టీ సిపిఐ పార్టీ అని, ఈ అంశంపై సిపిఐ చేపట్టిన ఆందోళన ఫలితంగానే అధికార పార్టీలు నేడు పేద ప్రజలకు కొంతమేరకు వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.వివిధ పేర్లతో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న పథకాల పేర్లకు బదులు జాతీయ స్థాయి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల, సంఘ సేవకుల పేర్లు పెడితే బాగుంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో పొన్నెకల్లులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి సుమారు 1525 మంది పాల్గొని తమ ఆరోగ్యాలను పరీక్షించుకున్నట్లు తెలిపారు.అదేవిధంగా గుంటూరు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో శంకర్ కంటి హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని, ప్రజల శ్రేయస్సే పరమావధిగా భావించి భవిష్యత్తులో సిపిఐ మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అలాగే కొత్తపేట మల్లయ్యలింగం భవన్ లో ఉన్న సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రతి ఆదివారం మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో విద్య, వైద్య రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి ప్రభుత్వాలు చేతులు దులుపుకునే పరిస్థితులు రానున్నాయన్నారు.అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గుంటూరు పట్టణంలో సిపిఐ అనేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. శంకర్ కంటి హాస్పటల్ సహకారంతో.. అంధత్వ నివారణ సంస్థ ద్వారా గుంటూరు పట్టణంలో ఇప్పటికే సుమారు 50 మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత కార్పొరేట్ హవాలో ప్రజలు హాస్పిటల్స్ కి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇటువంటి నేపథ్యంలో విద్యా, వైద్యాన్ని ప్రతి పేదవారికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిమిత్తం అశోక్ నగర్ లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. సురక్ష హాస్పిటల్ అధినేత, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రగతిరెడ్డి పోశం మాట్లాడుతూ సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, హైకోర్టు లాయర్ హరగోపాల్ ల సహకారంతో డాక్టర్ నిరంజన్ స్ఫూర్తితో సురక్ష హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.పేదవారికి ఉపయోగపడే ఏ సేవలనైనా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సిపిఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ నేడు విద్య, వైద్యం కమర్షియల్ అయిన తరుణంలో ప్రజల శ్రేయసే సిపిఐ లక్ష్యంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. నిరుపేదలు నివసించే కాలనీలో గతంలో సిపిఐ మరికొందరి వైద్యుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు.హైకోర్టు లాయర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజా అవసరాలు తీర్చేందుకు తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. శంకర కంటి వైద్యశాల క్యాంపు ఇన్చార్జి రవికాంత్ మాట్లాడుతూ పార్టీలు, మతాలకు అతీతంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో అశోక్ నగర్ శాఖ కార్యదర్శి ఆకిటి రామచంద్రుడు, సిపిఐ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేడ హనుమంతరావు, సిపిఐ గుంటూరు నగర కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న, పరిమళ బన్నీ, బి. వెంకటేశ్వరరెడ్డి, ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని సిపిఐ నాయకులు అప్పమ్మ ఆకిటి శివకుమార్, అనిల్ కుమార్, గోపాలకృష్ణ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సర్వేలను వారంలోగా పూర్తి చేయాలి: జీఎంసీ కమిషనర్



**గుంటూరు, రాజధాని వాయిస్:** రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశిత సర్వేలను వారంలోగా పూర్తి చేసి, గుంటూరు నగర పాలక సంస్థ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సచివాలయాల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. శనివారం నగర పాలక సంస్థలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డ్ సచివాలయాలకు ప్రత్యేకాదికారులుగా నియమించబడిన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సర్వేలను త్వరితగతిన పూర్తి చేయుటకు తీసుకోవాల్సిన చర్యల పై తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సచివాలయాల్లో కార్యదర్శులు ప్రజలకు అందుబాటు లో ఉండుటలేదని ఫిర్యాదులు అందుతున్నాయని, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యదర్శులు విధి నిర్వహణలో బయటకు వెళితే తప్పకుండా వారు మూవ్మెంట్ రిజిస్టర్ లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.వార్డ్ ప్రత్యేక అధికారులు వార్డు సచివాలయాల పనితీరును పర్యవేక్షించడంతో పాటు ప్రభుత్వ సర్వేలు, ఎన్నికల పనులు, జనగణన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ సర్వేలైన ఈకెవైసి, పురమిత్ర సర్వేలు మరియు ఇతర ప్రభుత్వ సర్వేలను వారం రోజుల్లో పూర్తి చేయాలని, అందుకు ప్రత్యేకాధికారులు సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారికి దిశా, నిర్దేశం చేయాలని ఆదేశించారు.సర్వేల నిర్వహణలో సమస్యలేమైనా ఉంటె అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యదర్శులు ఎవరైనా విధుల యందు నిర్లక్ష్యం వహిస్తే వారి పై చర్యలకు సిఫారసు చేయాలని ఆదేశించారు. అలాగే నూతన పెన్షన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకొని, సదరు దరఖాస్తులను ఎటవంటి ఆలస్యం లేకుండా వెంటనే పరిశీలించి అధికారులకు పంపాలని ఆదేశించారు.ముఖ్యంగా ప్రజల నుండి వచ్చే పిర్యాదుల పరిష్కారం పట్ల అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు వాట్సప్ గవర్నేన్స్ గురించి వివరించి, ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి ప్రజలకు తెలియచేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్. శ్రీనివాస్, మేనేజర్బాలాజీ బాష, వార్డ్ పాల్గొన్నారు.

## గుంటూరులో ఘనంగా స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

**గుంటూరు, రాజధాని వాయిస్:** పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో శనివారం చేపట్టారు. జిల్లాలో నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశాలు మేరకు పాల్గొన్నారు.పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రజలతో స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ పెదకాకాని మండలంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్యారీబ్యాగులు, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేత యేసుబాబును పరామర్శించిన సుచరిత

**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు జిల్లా: ప్రత్తిపాడు మండలం, తిక్కిరెడ్డిపాలెం గ్రామంలో మాజీ మండల యస్.సి.సెల్ అధ్యక్షులు, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ జొన్నలగడ్డ యేసుబాబు గారికి గత కొద్దిరోజుల క్రితం ఇనుప ర్యాక్ తగిలి కాలు నరం కట్ అవుటవలన హాస్పిటల్ నందు సర్జరీ చేయించుకొని డిస్చార్జ్ అయ్యారు అని తెలుసుకొని ఈ రోజు వారి గృహంను మేకతోటి సుచరిత మాజీ హోం శాఖామాత్యులు, పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వారు సందర్శించి యేసుబాబు గారిని పరామర్శించి, యోగ క్షేమములు అడిగి తెలుసుకొన్నారు.

## అక్రమ కట్టడాలు కూల్చివేసిన ఫారెస్ట్ అధికారులు






**రాజుపాలెం.సెప్టెంబర్ 19, రాజధాని వాయిస్:** పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి జి.కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు రాజుపాలెం మండలం, కొండమోడు దగ్గర గల వీరమ్మ కాలనీలో రిజర్వ్ ఫారెస్ట్ లో కట్టిన అక్రమ నిర్మాణాలను రాజుపాలెం పోలీస్ లు, అటవీశాఖ సిబ్బంది సమన్వయంతో తొలగించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,అడవిలో ఎవరైనా ఆక్రమణలు,అక్రమ కట్టడాలు కట్టిన ఎడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డివి రమణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.వి.ఎల్ నాయుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్యాం కుమార్, ప్రొటెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు మంత్రి సవిత



**పెనుగొండ. సెప్టెంబర్ 19 రాజధాని వాయిస్ :**రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన అర్హులైన చేనేతలందరికీ పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. పెనుకొండ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, కొత్తగా అందిన 16,521 దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని, ఇప్పటికే 84 వేల మందికి పైగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే నేరుగా పింఛన్ మంజూరు చేస్తుందని, దరఖాస్తుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు.ఇదే సమయంలో శ్రీసత్యసాయి జిల్లాలో దరఖాస్తుల పరిశీలన పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో, డీవో రమణారెడ్డి, ఏడీవో శీనా నాయక్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించగా, కమిషనర్ రేఖారాణి వారిని సస్పెండ్ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా మంత్రి సవిత హెచ్చరించారు.

## పురుషోత్తమపట్నం వినాయక మండపంలో మాజీ మంత్రి విడదల రజిని పూజలు



**చిలకలూరిపేట.సెప్టెంబర్ 19 రాజధాని వాయిస్ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పురుషోత్తమపట్నంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మాజీ మంత్రి విడదల రజిని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సమృద్ధులతో వర్ధిల్లాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖు లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం కావాలి

**గుంటూరు, సెప్టెంబరు 19 (రాజధాని వాయిస్):**కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం జోరుగా సాగింది. ప్రత్యేక అధికారులు, ప్రజలు కలిసి పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టి, మొక్కలు నాటడంతో పాటు స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. పెదకాకానిలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ మాట్లాడుతూ, ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రజలంతా ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి, కాటన్ లేదా గన్నీ బ్యాగులను వాడాలని సూచించారు.

# ఈ నెల 21న మెగా గ్రీవెన్స్ డే..!

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే జూలకంటి



**మాచర్ల.సెప్టెంబర్ 19 రాజధాని వాయిస్ :**ఈ నెల 21, సోమవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మెగా గ్రీవెన్స్ ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం మీడియాకు తెలిపారు. నెహ్రూనగర్ బోటు మీద వి.వి.ఎన్ గార్డెన్స్ నందు ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేస్తున్న ఈ మెగా గ్రీవెన్స్ కు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా,అన్నీ శాఖల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. రెవెన్యూ, ఇతర న్యాయపరమైన సమస్యలపై అర్జీల రూపంలో అందించి, పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులందరూ ఒకే వేదికపై వచ్చి.., ప్రజా సమస్యలపై తక్షణ పరిష్కారం చూపే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే




**మాచర్ల.సెప్టెంబర్ 19 రాజధాని వాయిస్ :**పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తాతయ్య, నానమ్మలను ఆహ్వానించి ఘన స్వాగతం పలికింది. నేటి తరానికి పెద్దల విలువేమిటి, వారిని ఏ విధంగా గౌరవించాలి, వారి అనుభవాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోవాలనే విషయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం విచ్చేసిన పెద్దలకు పలు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పెద్దలు కూడా విద్యార్థులను ఆశీర్వదిస్తూ ఉన్నత భవిష్యత్తు కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, ఏవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ శ్రీలక్ష్మి, సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై ధర్నా నిర్వహణ





**పెనుకొండ, సెప్టెంబర్ 19 :** రైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ నేతృత్వంలో రొద్దం మండలంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ఈ ఆందోళన చేపట్టారు. రైతు భరోసా, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సాగునీరు, వ్యవసాయ విద్యుత్, గిట్టుబాటు ధర వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి విద్యుత్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పంటలకు అవసరమైన సమయంలో సరిపడా విద్యుత్ అందకపోతే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల సాగులో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులకు విద్యుత్ సమస్యలు మరింత భారంగా మారుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు.పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం వంటి సహాయాలను అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో అందించాలని కోరారు. గతంలో రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రైతులకు మద్దతు లభించిందని గుర్తుచేస్తూ ప్రస్తుతం కూడా అదే స్థాయిలో సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆమె కోరారు. పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని సూచించారు. కరువు ప్రభావిత ప్రాంతాలకు వర్తించే అన్ని సహాయక చర్యలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉషశ్రీ చరణ్ కోరారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల వల్ల రైతులు నష్టపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పంట చేతికి వచ్చిన తర్వాత గిట్టుబాటు ధర లభించేలా చూడాలని, అవసరమైన చోట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా చర్యలు అవసరమని తెలిపారు. రైతు సమస్యలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఉషశ్రీ చరణ్ ప్రభుత్వాన్ని కోరారు. రైతు భరోసా, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సాగునీటి సౌకర్యాలు, పశుగ్రాసం వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు చెమటతోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందని పేర్కొంటూ అన్నదాతలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# టిడ్కో కాలనీకి ప్రత్యేక బస్సు

- రవాణా సమస్యకు పరిష్కారం లభింపు
- సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే రాము
- ప్రయాణికులతో కలిసి బస్సు ప్రయాణం



**గుడివాడ, సెప్టెంబర్ 19 :** గుడివాడ టిడ్కో కాలనీ వాసులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. టిడ్కో కాలనీ ఏర్పాటైన తర్వాత తొలిసా రిగా గుడివాడ--టిడ్కో కాలనీ మధ్య ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ప్రత్యేక సర్వీసును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. కాలనీ ప్రజలు ఉద్యోగాలు, విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం పట్టణానికి రాకపోకలు సాగించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్థానికులతో కలిసి పాల్గొన్నారు. టిడ్కో కాలనీ నుంచి గుడివాడ ఆర్టీసీ డిపో వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకుని వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రయాణికులకు జీరో ఫేర్ టికెట్లను అందజేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల ఉచిత ప్రయాణ పథకం ప్రయోజనాలను వివరించారు. టిడ్కో కాలనీలో నివసిస్తున్న ప్రజలు చాలా కాలంగా సరైన రవాణా సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నారని స్థానికులు తెలిపారు. కాలనీ నుంచి పట్టణానికి చేరుకోవడానికి ఆటోలు, ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని వివరించారు. ఇప్పుడు ప్రత్యేక బస్సు సర్వీసు అందుబా టులోకి రావడంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని ఆనందం వ్యక్తం చేశారు. టిడ్కో కాలనీ రవాణా సమస్యపై ఇటీవల ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశం జరిగిన కేవలం రెండు రోజుల్లోనే ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభం కావడం విశేషంగా నిలిచింది. ప్రజల అవసరాలను గుర్తించి వేగంగా స్పందించిన అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్య మని పేర్కొన్నారు.ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించా లంటే ఆర్టీసీ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎమ్మె ల్యే సూచించారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, వృద్ధులు, విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సేవలు నిర్వహించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ఆర్టీసీ పనిచేయాలని సూచించారు. గుడివాడ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయా లను ఒక్కొక్కటిగా అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం కావాలి




**పెదకాకాని.సెప్టెంబరు 19రాజధాని వాయిస్ :**కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జోరుగా సాగింది. ప్రత్యేక అధికారులు, ప్రజలు కలిసి పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టి, మొక్కలు నాటడంతో పాటు స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.పెదకాకానిలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ప్రజలంతా ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి, కాటన్ లేదా గన్నీ బ్యాగులను వాడాలని సూచించారు. చెత్త, ఈ-వ్యర్థాలను క్లాప్ మిత్రలకే అందించాలని, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకుని ఆహ్లాదకర వాతావరణాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## డిబిఆర్సి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం



**రాజుపాలెం.సెప్టెంబర్ 19,రాజధాని వాయిస్:**ఆర్ ఆర్ సెంటర్ లో దళిత బహుజన రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ కొండా రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవలు,డిజిటల్ చెల్లింపులు,యుపిఐ వినియోగం,ఆన్ లైన్ లావాదేవీలు,సైబర్ మోసాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కమ్యూనిటీ సభ్యులకు వివరించారు. బ్యాంకు ఖాతాలను సురక్షితంగా నిర్వహించుకోవాలని సూచించారు.డిబిఆర్సి కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటి రత్నం మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు డిజిటల్,ఆర్థిక సేవలపై అవగాహన కల్పించేందుకు డిబిఆర్సి ఆధ్వర్యంలో యిటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంద న్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు పెద్ది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పనులు, స్వచ్ఛతా హి సేవను వేగవంతం చేయాలి కలెక్టర్ వినోద్ కుమార్



**బాపట్ల.సెప్టెంబర్ 19రాజధాని వాయిస్ :** ఓటర్ల జాబితాలో ఫోటో అప్‌లోడింగ్, ఈఆర్వో, ఏఈఆర్వోల వద్ద ఉన్న హియరింగ్ పెండింగ్‌లను తక్షణమే పూర్తి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓటర్ జాబితాలో నాణ్యమైన ఫోటోలు ఉండేలా చూడాలని, ఫారాలు 6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు.పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రారంభంకాని పనులను వెంటనే మొదలుపెట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే అక్టోబర్ 2 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని శాఖలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్య ంతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ డీఆర్వో లవన్న, డీపీవో ఎల్. ప్రభాకర్ రావు, పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణ, సీపీవో ఏ.ఎస్. రాజు, పంచాయతీ డీఈలు, ఏఈలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షఫీ పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాములపై నిరంతర నిఘా ఉంచాలి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల. సెప్టెంబరు 19రాజధాని వాయిస్ :**స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి త్రైమాసిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల పాత సీళ్లను తొలగించి, పరిశీలన అనంతరం తిరిగి నూతనంగా సీళ్లు వేయించారు. అనంతరం త్రైమాసిక తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు, వివరాలను ఈఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసిన తీరును పరిశీలించారు.గోదాముల వద్ద సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిరంతర నిఘా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, పుటేజీని పకడ్బందీగా భద్రపరచాలని స్పష్టం చేశారు. ఈవీఎం గోదాములకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో లవన్న, ఆర్డీవో హరికుమార్, తహసీల్దార్ సలీమా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com